# ఇన్లాండ్ లెటర్ కథలు

## ప్రేమ

ఏడి వీడు అంటూ నిప్పులు చెరుగుతూ వచ్చిన భర్త వినయ్‌ని చూసి భయంతో వణికిపోయింది ప్రమీల. మధ్యగదిలో నోట్‌బుక్‌లోని పేపర్లను చింపి, గాలిపటాలు చేసి ఎగరేస్తూ ఆడుకుంటున్న ప్రణీత్ తండ్రి అరుపులకు బిక్కచచ్చిపోయి, గోడకు బల్లిలా అతుక్కుపోయాడు.

ప్యాంట్‌కున్న బెల్ట్ వూడదీసి, ప్రణీత్‌ను బరబరా ఈడ్చుకు వచ్చి 'స్కూలుకు వెళ్లకుండా ఎకకడెక్కడ తిరుగుతున్నావురా' అంటూ వళ్లు వాతలు తేలేలాగా కొట్టడం మొదలుపెట్టాడు వినయ్. కొడుకు ఏడుపులు వినలేక ప్రమీల తల్లిప్రాణం తల్లడిల్లిపోయింది. ఈ మధ్య ఈ తతంగం మామూలై పోయింది ఆ ఇంట్లో. అల్లరి చిల్లరి కొడుకు, రుద్రావతారం ఎత్తే భర్త. వీరిద్దరి మధ్య నలిగిపోతుంది తను. కొడుకును సరిదిద్దలేదు. భర్తకు నచ్చచెప్పలేదు. భర్తకు సర్ది చెప్పబోతే 'నీ వల్లే చెడిపోతున్నాడు వీడు' అంటూ తన మీద విరుచుకు పడతాడు."ఈరోజు వీడికి తిండి పెట్టకు, ఆకలితో మాడితేకాని బుద్ధి రాదు వెధవకు" అంటూ విన విన లాడుతూ వెళ్లి పోతున్న భర్త మాటలకు ఈ లోకంలోనికి వచ్చింది ప్రమీల.

ప్రణీత్ వారికి ఒక్కగానొక్క కొడుకు. ప్రాణంగా పెంచుకోసాగారు అతనిని. వినయ్ ప్రాణస్నేహితుడు జయంత్‌కు కూడా ఒక్కగానొక్క కొడుకు. అతను కొడుకుని గారాబంగా పెంచటం వలన అల్లరి చిల్లరి తిరుగుళ్లు చెడు సహవాసాలకు అలవాటు పడ్డాడని తెలిసిన వినయ్, తన కొడుకును కట్టుదిట్టంగా పెంచాలని నిర్ణయించాడు. అందువల్ల ప్రతి చిన్న తప్పుకు దండించసాగాడు. ప్రేమతో నచ్చచెప్పాలని ఎప్పుడూ ప్రయత్నించలేదు. తండ్రి ప్రవర్తనలోని మార్పు, విపరీతమైన కట్టుదిట్టాల కారణంగా మొండితనంతో చెడుదారి పట్టసాగాడు ప్రణీత్.

కేవలం పన్నెండేళ్ల చిరుప్రాయంలోనే కొడుకు చేస్తున్న పని తెలిసిన వినయ్‌కు గుండె బద్దలయ్యింది. ఆరోజు వినయ్ కోపానికి గల కారణం.

ఇలా ఉండగా వినయ్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. సరైన స్కూళ్లు కూడా లేని మారుమూల ప్రదేశానికి. కనుక భార్యను కొడుకును వదలి అంత దూరం వెళ్లటానికి మనసు రాకపోయినా కొడుకు చదువుకోసం తప్పని పరిస్థితులలో వారిని పట్నంలోనే ఉంచాల్సి వచ్చింది వినయ్‌కు.



కాలగర్భంలో మూడేళ్లు కలిసిపోయాయి. ఆరోజు ఆదివారం. ఆ మారుమూల ప్రాంతంలో సెలవుదినాలలో పేపరులేనిదే కాలక్షేపం కాదు కనుక ప్రక్క ఇంటినుంచి పేపర్ తీసుకుని వచ్చి చదవటానికి ఉపక్రమించాడు వినయ్. "లోపలి పేజీల్లో పదవ తరగతి పరీక్ష ఫలితాలు" అని మొదటి పేజీలో చూసిన వినయ్‌కు ప్రణీత్ కళ్ల ముందు మెదిలాడు. ప్రణీత్ కూడా ఆ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు వ్రాసాడు. కొడుకు పాసవుతాడని తనకేమాత్రం నమ్మకం లేదు. కొడుకు పరీక్షలు బాగా వ్రాసాడని భార్య ఉత్తరాలు వ్రాయటం కేవలం తనకు వూరట కలిగించడానికే అని తెలుసు. గబగబా లోపలికి వెళ్లి డైరీ పట్టుకొచ్చి కొడుకు నెంబర్ తీసాడు. భరించలేని టెన్షన్‌తో లోపలిపేజీ తిప్పిన వినయ్‌కు ఒక్క నిమిషం తను చూస్తున్నది నిజమో కాదో అర్థం కాలేదు. ఇది కలయా? వైష్ణవ మాయా? ఎదురుగా తన కొడుకు ఫోటో, పైన 'రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు సాధించిన ప్రణీత్' అని వుండటం నమ్మశక్యం కాలేదు. సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

వినయ్‌కు తెలియదు. కొడుకు ఘన విజయం వెనుక హస్తం ఎవరిదో. తన అనవసర భయాలతో కట్టుదిట్టాలతో కొడుకు మెదడులో నిర్లక్ష్య బీజాలు నాటితే, వాటిని సమూలంగా పెరికి వేసి, ఎంతో శ్రమకోర్చి పెడత్రోవ పట్టిన కొడుకును ప్రేమతో సరిదిద్ది, ప్రయోజకుడిగా, ఉన్నతుడిగా తీర్చిదిద్దింది తన భార్యని. ప్రేమతో సాధించలేనిది ఏదీ లేదని.

సురేఖ, న్యూఢిల్లీ.



## నీవు నేర్పిన విద్య

రాము సోముకు రెండువందల రూపాయలు బాకీ వున్నాడు. తన బాకీ తీర్చకపోవడంతో సోము న్యాయస్థానానికి ఫిర్యాదు చేసాడు. రాము పార్వతీశం అను వకీలును తన తరపు వాదించడానికి కుదుర్చుకున్నాడు. పార్వతీశం రాముకు న్యాయస్థానంలో ఎలా ప్రవర్తించాలో చెబుతూ, న్యాయవాది అడిగిన ప్రశ్నలకు ఏమీ సమాధానం చెప్పకుండా "అయ్! అయ్" అంటూ తలూపుతు వుండమన్నాడు.

న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతున్నది. న్యాయస్థానంలో రాము ఏమి మాట్లాడకుండా "అయ్! అయ్" అంటున్నాడు. ఫిర్యాది తరపు వకీలు ఎన్ని ప్రశ్నలు వేసినా అదే అరుపు అరుస్తున్నాడు. తుదకు న్యాయస్థానం రాము పిచ్చివాడని తీర్మానించి కేసు కొట్టివేసింది.

వకీలు పార్వతీశం విజయగర్వంతో ఉబ్బితబ్బిబ్బయివాడు కేసు గెలిచినందుకు. రాము వద్దకు వచ్చి తన ఫీజు గురించి అడిగాడు. రాము "అయ్! అయ్"అంటున్నాడు గానీ మరేమీ పలుకుటలేదు. డబ్బు ఇవ్వలేదు. అసలు డబ్బు లేకుండానే వచ్చాడు. తను నేర్పిన విద్య తనకే గుణపాఠం నేర్పిందని పార్వతీశం ఔరా! అని ముక్కుమీద వేలు తలపై రుమాలు వేసుకున్నాడు.

-వీలం రామమూర్తి, ఒరిస్సా.